నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
మంగళవారం | డిసెంబర్ 12, 2023 | www.navatelangana.com

కార్మికుని కుటుంబానికి చేయూత

జన్నారం : ఇటీవల బతుకుదెరువుకు పోయి మస్కట్‌లో గుండెపోటుతో మృతి చెందిన కవ్వాల గ్రామానికి చెందిన అంబటి అనంతయ్య కుటుంబానికి కవ్వాల్ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి తరపున రూ.20వేలు అందజేశారు. ఈ సందర్భంగా గల్ఫ్ కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం గల్ఫ్ కార్మికులకు తీరని నష్టం కలిగించిందన్నారు. గల్ఫ్ కార్మికులకు అండగా ఉంటామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చినందుకు కార్మికులు ఆ పార్టీకి ఓట్లేసి గెలిపించారన్నారు. ప్రభుత్వం కార్మికులను చిన్న చూపు చూడకుండా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వం అనంతయ్య కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో టిజిడబ్ల్యూడబ్ల్యుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగొండ తిరుపతి, కవ్వాల్ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి వ్యవస్థాపకులు పరకాల మహేష్, రాజలింగు, బాపు, శ్రీనివాస్, షాకీర్, రాకేష్ పాల్గొన్నారు.



మౌంట్ కార్మెల్‌లో సైన్స్ ఎక్స్‌పో

నవతెలంగాణ - హాజీపూర్

గుడిపేట్‌లోని మౌంట్ కార్మెల్ హైస్కూల్‌లో సోమవారం సామాన్య విజ్ఞాన సదస్సు(సైన్స్ ఎక్స్‌పో) నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు వివిధ రకాల సైన్స్, ఆర్ట్స్ ప్రయోగాలు చేసి అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మదర్ జియో హాజరై ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చేసిన ప్రయోగాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సిస్టర్ మెటిల్, అల్ఫీ, సతీష్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి అభినందనలు



నవతెలంగాణ-జన్నారం

జిల్లా స్థాయిలో సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో 'మానవ విలువలు నేటి సమాజం' అనే అంశంపై ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన కలమడుగు పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని సురక్షితను ఎంఈఓ విజయ్‌కుమార్‌తో పాటు పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకతను బయటికి తీయడానికే ఇలాంటి వ్యాసరచన పోటీలు ఉపకరిస్తాయన్నారు. సురక్షితను స్ఫూర్తిగా తీసుకొని ఇతర విద్యార్థులు ఇలాంటి పోటీ పరీక్షలలో పాల్గొని విజయాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి, సత్యసాయి ట్రస్టు సభ్యుడు ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు రమేష్, జనార్ధన్, లక్ష్మయ్య, కుమారస్వామి, శ్రీనివాస్, తిరుపతి, నర్సయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సమస్యలు పరిష్కరించాలని పాఠకులు కలెక్టర్ బోర్కడే హేమంత్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రంథాలయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. పోటీ పరీక్షలకు సరిపడా పుస్తకాలు లేవని, అవసరమైన పుస్తకాలు తెప్పించడం లేదని పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాల నుండి జిల్లా గ్రంథాలయం నిర్మాణ దశలోనే ఉందని, ప్రస్తుత గ్రంథాలయంలో కనీస వసతులు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. నెలవారీ మ్యాగజైన్లు తెప్పించడం లేదని తెలిపారు. సమస్యలు పరిష్కరించి పాఠకులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పాఠకులు మల్లేష్, ఆశిష్, జమీర్, అనిల్‌గౌడ్, మధుకర్ తదితరులున్నారు.

సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలపై సమీక్ష



నవతెలంగాణ-నస్పూర్

డిసెంబర్ 23న నిర్వహించే సింగరేణి ఆవిర్భావ దినోత్సవంపై ఎస్ఓ టు జీఎం రఘుకుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ శ్రీరాంపూర్ యాజమాన్యం సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రగతి స్టేడియంలో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోందన్నారు. మొదట జీఎం కార్యాలయంలో తర్వాత ప్రగతి స్టేడియంలో జెండా ఆవిష్కరణ, స్టాల్స్ ఓపెనింగ్, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉత్తమ గృహాలకు బహుమతులు, శ్రీరాంపూర్ ఏరియాలో ఉత్తమ ఉద్యోగుల సన్మానం కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, వర్క్‌షాప్ ఇంజనీర్స్ సతీష్ చక్రవర్తి, రవి కుమార్, సీనియర్ పీఓ పి.కాంతారావు పాల్గొన్నారు.

సర్పంచ్, ఎంపీడీఓపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ - రెబ్బెన

మండలంలోని గోలేటి గ్రామ పంచాయతీలో రూ.1.50కోట్ల నిధులు దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచ్ పోటు సుమలత శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీఓ సత్యనారాయణసింగ్‌పై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టర్ హేమంత్ సహదేవరావుకు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోలేటి గ్రామ పంచాయతీలో 650 మంది లబ్ధిదారుల ఎస్‌బీఎం మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు, గ్రామాభివృద్ధి నిధులు సుమారుగా రూ.1.50 కోట్లు దుర్వినియోగమయ్యాయని తెలిపారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యదర్శి వై కృష్ణకుమారి, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చేకూరి నవీన్‌గౌడ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు ఉప్పరి మల్లేష్, జటంగుల వెంకటేశ్ ఉన్నారు.

సింగరేణిలో ఎన్నికల సమరం..!

- పూర్తయిన నామినేషన్ల పర్వం..బరిలో 13సంఘాలు
- ఈ నెల 27న ఎన్నికలు..అదే రోజున ఫలితం
- కార్మికులను మచ్చిక చేసుకునేందుకు యత్నాలు
- కోల్‌బెల్ట్‌లో ప్రారంభమైన కోలాహలం

నల్లబంగారు నేలగా పిలిచే సింగరేణి క్షేత్రంలో ఎన్నికల సమరం ప్రారంభమైంది. కరోనాతో పాటు వివిధ కారణాలతో వాయిదా పడుతూ వచ్చిన గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహించేందుకు కేంద్ర కార్మికశాఖ సిద్ధమైంది. పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల 27న ఎన్నికలు నిర్వహించి అదే రోజున ఫలితాలు వెల్లడించాలని నిర్ణయించింది. ఇప్పటికే నామినేషన్ల పర్వం పూర్తయింది. 14సంఘాలు నామినేషన్లు వేయగా, ఒకటి తిరస్కరణకు గురైంది. ప్రస్తుతం 13 సంఘాలు బరిలో నిలిచాయి. పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఆయా కార్మిక సంఘాలు సమాయత్తమవుతున్నాయి. కార్మికులను మచ్చిక చేసుకునేందుకు ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నాయి. గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించి కార్మికుల్లో పట్టు నిలుపుకోవాలని భావిస్తుండటం ఆసక్తి రేపుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సింగరేణి కార్మికక్షేత్రంలో ఎన్నికల సందడి మొదలైంది. గుర్తింపు కోసం ఆయా సంఘాలు తీవ్రంగా పోటీపడుతున్నాయి. ప్రధాన సంఘాల మధ్య ఇప్పటికే కోల్డ్‌వార్ ప్రారంభమైంది. కార్మికులను మచ్చిక చేసుకునేందుకు ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. సింగరేణిలో ప్రాంతంలో 11డివిజన్లు ఉండగా.. 14సంఘాలు నామినేషన్లు వేశాయి. ఇందులో ఒకటి తిరస్కరణకు గురికాగా.. ప్రస్తుతం 13 సంఘాలు బరిలో నిలిచాయి. సింగరేణి వ్యాప్తంగా 37,748 ఓట్లు ఉన్నాయి. ప్రస్తుతం గుర్తింపు సంఘం ఉన్న టీబీజీకేఎస్ మరోసారి ఆధిపత్యాన్ని చాటాలని భావిస్తుండగా.. కార్మిక సంఘంగా ఉన్న ఏఐటీయూసీ తాజా ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. ఇక తాజాగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అనుబంధ సంఘమైన ఐఎన్‌టీయూసీ సైతం గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించేందుకు సిద్ధమవుతోంది. ఇది వరకు ఏఐటీయూసీకి మద్దతుగా నిలిచిన ఈ సంఘం తాజా ఎన్నికల్లో సొంతంగా బరిలో నిలిచేందుకు సిద్ధమైంది. ఇక కార్మికుల సమస్యలపై పోరాడుతూ సింగరేణి ప్రాంతంలో మంచి పట్టుకలిగిన సీఐటీయూ సైతం ఈ సారి గుర్తింపు సాధించేందుకు ఎన్నికల బరిలో నిలిచింది. కార్మిక క్షేత్రంలో బలమైన ముద్ర వేసిన ఈ సంఘాల మధ్యనే తీవ్ర పోటీ నెలకొనగా..హెచ్ఎంఎస్, బీఎంఎస్‌లతో పాటు మిగితా సంఘాలు సైతం సత్తాచాటేందుకు సమాయత్తమవుతున్నాయి.

పట్టుకోసం తీవ్ర ప్రయత్నాలు..!

కేంద్ర కార్మికశాఖ ప్రతి రెండేండ్లకో సారి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తోంది. ఇది వరకు 2018లో జరిగిన ఎన్నికల్లో టీబీజీకేఎస్ అధిక డివిజన్లు గెలుచుకొని గుర్తింపు సంఘంగా ఎన్నిక కాగా.. రెండు డివిజన్లలో విజయం సాధించిన ఏఐటీయూసీ కార్మిక సంఘంగా గుర్తింపు పొందింది. ఇప్పటికే ఎన్నికల కాలపరిమితి ముగిసిపోయినప్పటికీ కరోనా కరోనాతో పాటు వివిధ కారణాలతో పలుమార్లు వాయిదా పడుతూ వచ్చాయి. తాజా అసెంబ్లీ ఎన్నికల కంటే ముందుగానే ఎన్నికలు నిర్వహించేందుకు కార్మికశాఖ సిద్ధమైంది. నామినేషన్లు కూడా స్వీకరించింది. కానీ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా న్యాయస్థానం తీర్పు మేరకు ఈ ఎన్నికలను వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా అసెంబ్లీ ముగిసిపోవడంతో సింగరేణి ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధం కావడంతో కార్మిక క్షేత్రంలో కోలాహలం మొదలైంది. ఆయా సంఘాలు కార్మికులను మచ్చిక చేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించాయి. తెలంగాణ రాష్ట్రానికి కొంగుబంగారమైన ఈ సింగరేణి ఎన్నికలపై రాష్ట్రంలో అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంటుంది. ఇటీవలే అసెంబ్లీ ఎన్నికలు పూర్తికావడం.. ప్రభుత్వం మారిపోవడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇది వరకు బీఆర్ఎస్‌కు అనుబంధ సంఘమైన టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉండగా.. తాజాగా కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఐఎన్‌టీయూసీ తాజా ఎన్నికల్లో విజయం కార్మికుల్లో పట్టు సాధించాలని భావిస్తోంది. కొన్ని జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న సింగరేణి ప్రాంతంలో జరుగుతున్న ఈ ఎన్నికలపై అందరి దృష్టి ఉండటంతో వీటిని కైవసం చేసుకునేందుకు ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం కార్మికులతో పాటు రాజకీయవర్గాల్లోనూ ఆసక్తి రేపుతోంది. కార్మికుల సంక్షేమంపై ఎవరికి వారు హామీలు గుప్పిస్తూ వారిని తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.





జిల్లా కేంద్రాల్లో ప్రారంభమైన ప్రజావాణి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి తిరిగి ప్రారంభమైంది. కలెక్టర్ బోర్కడే హేమంత్, డిఆర్ఓ సురేష్ అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాగజ్‌నగర్ మండలం బారెగూడ గ్రామానికి చెందిన వడాయ సంతోష్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా ఆసరా పెన్షన్, ఆహార భద్రత కార్డుతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందుతున్నాడని, విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆసిఫాబాద్ పట్టణంలోని సందీప్‌నగర్‌కు చెందిన దివ్యాంగుడు శంకర్ ఆసరా పెన్షన్ ఇప్పించాలని కోరాడు. సిర్పూర్(టి) మండలం తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ పాఠశాలకు 15 గ్యాస్ సిలిండర్‌లను మంజూరు చేయాలని కోరారు. కెరమెరి మండలం అనార్‌పల్లి



ఆసిఫాబాద్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హేమంత్ సహదేవ్‌రావ్



మంచిర్యాలలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోస్, పక్కన అదనపు కలెక్టర్

గ్రామానికి చెందిన దివ్యాంగుడు ఇస్లావత్ శ్రీకాంత్ ఆసరా పెన్షన్ మంజూరు చేయాలని కోరాడు. ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన కె.సంధ్య వైద్య కళాశాలలో ఉద్యోగం కల్పించాలని కోరింది. కాగజ్‌నగర్ పట్టణం ద్వారకానగర్‌కు చెందిన అబ్దుల్ కలీం ఐటిఐలో ఎలక్ట్రీషియన్ పూర్తి చేశానని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

నస్పూర్ : ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల సమన్వయంతో కృషి చేస్తామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రితో కలిసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. పలువురు వివిధ సమస్యలపై కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారులతో సమగ్ర విచారణ జరిపి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, నూతన కార్యక్రమాల ప్రారంభోత్సవంలో అధికారులు ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని ఎంపీపీ మల్లికార్జున్ సూచించారు. ఎంపీడీఓ శశికళ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ అలీబీన్ అహ్మద్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అభివృద్ధి నివేదికలను అధికారులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం అధికారులు కృషి చేయాలన్నారు. రైతు బీమా అందించడంలో వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. మహాలక్ష్మి పథకం ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులకు సమాచారం అందించకపోవడంపై ఆర్టీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలా జరగకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తూ ఉన్నత ఫలితాల కోసం కృషి చేయాలన్నారు. గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా ఉండాలన్నారు. మండలంలోని దస్నాపూర్, కోసర, జెండగూడ ప్రాంతాల్లో అదనపు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలోని బాబాపూర్, ఇటిక్యాల, బెల్గాం తదితర ప్రాంతాల్లో లీకేజీ అవుతున్న మిషన్ భగీరథ పైపులను వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీఓ ప్రసాద్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

- ఎమ్మెల్యే హరీష్‌బాబు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు నియోజకవర్గ అధికారులు సమర్థవంతంగా తమ విధులను నిర్వర్తించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు సూచించారు. సోమవారం వివిధ శాఖల అధికారులు తనను కలిసేందుకు రాగా వారితో ఆయన మాట్లాడారు. అధికారులపై ఒత్తిళ్లు, వేధింపులు ఉండవని, వారు తమ బాధ్యతలను కచ్చితంగా నిర్వర్తిస్తే ఎలాంటి ఆటంకాలు ఉండవని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్యతో పాటు కార్యాలయ సిబ్బంది ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సత్కరించారు. ఐటీడీఏ డీఈఈ నిరంజన్‌రావు, ఎఈ సయ్యద్ బద్రుద్దీన్‌తో పాటు పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ పద్మశాలి సేవా సంఘం నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కుడిక్యాల రాజమౌళి, ప్రధాన కార్యదర్శి కేదారితో పాటు పలువురు పాల్గొన్నారు. పద్మశాలి సంఘం తరపున అధ్యక్షులు దాసరి వెంకటేష్-నాగరాణి దంపతులు కూడా ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందించి శాలువాతో సత్కరించారు. అదేవిధంగా టీయూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శాంతికుమార్, సభ్యులు భానుప్రకాష్, రాజేశ్, తిరుపతి పాల్గొన్నారు.

క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్లు



నవతెలంగాణ-నస్పూర్

బంగ్లా ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో సింగరేణి వ్యాప్తంగా ఉన్న 28 అధికారుల క్లబ్ సభ్యులకు షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, టెన్నికాయిట్ క్రీడల ముగింపు కార్యక్రమానికి డైరెక్టర్ ఫైనాన్స్, పా ఎస్. బలరాం, డైరెక్టర్ ఈ అండ్ ఎం డి సత్యనారాయణరావు, జనరల్ మేనేజర్ కార్పొరేట్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్, సింగరేణి అధికారుల సంఘం ప్రెసిడెంట్ జక్కం రమేష్, ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న అధికారులు ఒకేచోట చేరి వారి ప్రతిభాపాటవాలను ప్రదర్శించడం చాలా సంతోషకరమైన విషయమని, క్రీడాకారులు క్రీడలలో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వం మెరుగవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు రాధా కుమారి సంజీవరెడ్డి, అధికారుల సంఘం సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఏవీ రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా అధికారుల సంఘం అధ్యక్షులు అబ్దుల్ ఖాదీర్, క్రీడల కన్వీనర్ డాక్టర్ రమేష్ బాబు, కో - కన్వీనర్ తిరుపతి, అన్ని ఏరియాల అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వాగులు, కాలువలను రక్షించాలి



నవతెలంగాణ-నస్పూర్

వాగులు, కాల్వలను కొందరు ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. సోమవారం ప్రజావాణిలో వాగులను, కాలువలను కాపాడాలని అడిషనల్ కలెక్టర్ మోతిలాలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ లక్సెట్టిపేట్ మండలంలోని గంపలపల్లి గ్రామ చెరువు నుండి ఇటిక్యాల చెరువులోకి వెళ్లే కాలువను, గంపలపల్లి చెరువు నుండి బోట్లకుంట వరకు రైతుల పంట పొలాలకు సాగు నీరు వెళ్లే కడెం ఆయకట్టు కాలువ పూర్తిగా కనుమరుగైందన్నారు. భారీ వర్షాలకు గంపలపల్లి చెరువు కట్ట తెగిపోయే పరిస్థితి వచ్చిందనే కారణంతో చెరువు కింద ఉన్న కాలువలు అక్రమణకు గురికావడం జరిగిందన్నారు. మండలంలోని పోతపల్లి గ్రామ శివారులోని సర్వే నెం.18 వద్ద ఉన్న వాగును సైతం ఆక్రమించి వెంచర్ ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ చూపి ఆక్రమణకు గురైన కాలువలు, వాగులను కాపాడాలని కోరారు.

గ్యాస్ ఏజెన్సీల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం గ్యాస్ కనెక్షన్లకు సంబంధించి ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఏజెన్సీల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని ఐఎన్టియుసి నాయకుడు అల్లూరి లోకేష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గ్యాస్ ఏజెన్సీ వద్ద ఉన్న మహిళల క్యూలైన్ సందర్శించారు. ఎండలో నిలబడటంతో ఓ మహిళ సొమ్మసిల్లిపోగా ఆమెను తీసుకెళ్లి ఈ1కేవైసీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు పెద్ద మొత్తంలో మహిళలు ఈ-కేవైసీ కోసం వస్తున్నారని, ఏజెన్సీ వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హాస్టల్స్, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉయిక విష్ణు కోరారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా... బాజ్‌పాయ్‌ను కలిసి విన్నవించారు. ఐటీడీఏ దగ్గరలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టాయిలెట్లు లేవని, కొన్ని హాస్టల్స్ చుట్టుపక్కల ప్రహరీ గోడ లేకపోవడంతో అక్కడ ఉన్న బాలికలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేబీ కాంప్లెక్స్‌లోని పీఎంహెచ్, టీటీడబ్ల్యూఆర్‌జేసీ హాస్టల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. టాయిలెట్స్ కూడా సరిగా సరిపోతాలేవన్నారు. ఇంద్రవెల్లిలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో ప్రహరీగోడ లేక బాలికలు స్నానం చేయడానికి కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇలా అన్ని పాఠశాలల్లో హాస్టల్లో పలు సమస్యలు ఉన్నాయని ఆ సమస్యలన్నీ తక్షణమే పరిష్కరించాలని కోరారు.

గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-బోథ్

ఆదివాసీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్ పంద్రం సుగుణ శంకర్ అన్నారు. సోమవారం మండలంలోని పట్నాపూర్ గ్రామపంచాయతీతో పాటు సుర్దాపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవికి వినతిపత్రం అందజేశారు. సూర్దాపూర్ గ్రామం ఏర్పడి సంవత్సరాలైనా నడవడానికి రోడ్డు లేక చాలా ఇబ్బంది పడుతున్నామన్నారు. పట్నాపూర్ గ్రామపంచాయతీలో ఉన్న బీడీ కార్మిక మహిళలకు నూతన పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన అధికారులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.



అతిథి అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

అతిథి అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని అతిథి అధ్యాపకుల సంఘం నాయకులు నాగరాజు, అన్నారు. సోమవారం రాచపూర్ మహాత్మ జ్యోతిభాపూలే అతిథి అధ్యాపకులు తమ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు కుచాడి శ్రీహరిరావుకు వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏండ్లుగా పనిచేస్తున్న తమను నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించి, సీఆర్టీలుగా గుర్తించాలని కోరారు. పని ఒత్తిడి నుంచి విముక్తి కల్పించి, 12 నెలలు వేతనం అందేలా చూడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో శ్రీధర్, నర్సయ్య జోహార్, కాశీనాథ్ ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



నవతెలంగాణ-నార్నూర్

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ అన్నారు. సోమవారం మండలంలోని మాన్కాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 13 మంది బాలికలకు వైద్య పరీక్షలు చేశారు. జ్వరం, జలుబు, దగ్గు, దురద ఉన్న వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చలికాలం నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని స్వెట్టర్లు ధరించాలని విద్యార్థులను సూచించారు. వైద్యశిబిరంలో ప్రధానోపాధ్యాయుడు దేవ్‌షావ్, ఉపాధ్యాయ సిబ్బంది మంగులాల్, తుకారాం, వసంత, వైద్య సిబ్బంది, ఈశ్వర్, జంగుబాయి, ఆశాలు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-దస్తురాబాద్

నియోజకవర్గ అభివృద్ధికి కృషి తనవంతు కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని 13 గ్రామపంచాయతీలను మొట్టమొదటి సారిగా ఎమ్మెల్యే హోదాలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే బుట్టాపూర్ గ్రామంలో పోచమ్మ ఆలయం వద్ద ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ప్రతి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దుర్గం మల్లేష్, చుంచు భూమన్న, గాజుల రాజేందర్, మనీష్, సత్యం, బబ్లు, రంజిత్, ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎక్సైజ్ ఉద్యోగులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌ను సోమవారం తన నివాసంలో ఆదిలాబాద్ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా విజయం సాధించినందుకు పుష్పగుచ్ఛాని అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పొచ్చన్న, జనరల్ సెక్రటరీ అరవింద్, యూనియన్ సభ్యులు భూమన్న, విఠల్, మహేందర్, వెంకటగిరి, మొహ్మద్, అశ్వక్ ఉన్నారు.

ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసిన మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా విజయం సాధించిన జాదవ్ అనిల్‌ను ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. నేరడిగొండ మండలంలోని అనిల్ జాదవ్ స్వగృహంలో ఆయనను కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్ పవన్ నాయక్, ఆవుల వెంకన్న, కొండ గణేష్ ఉన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు నిలిపేవరకు పోరాడుతాం



ఇథనాల్ ఫ్యాక్టరీ ముందు ఆందోళన చేస్తున్న రైతులు, గ్రామస్తులు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు నిలిపేవరకు పోరాడుతామని గుండంపల్లి, దిలావర్‌పూర్ గ్రామ రైతులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. శివారులోని పంట పొలాలలో నిర్మాణానికి తలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ పనులను నిలిపివేయాలన్నారు. గత ఆరు నెలల క్రితమే తమ గ్రామాల్లో ఇథనాల్ ఫ్యాక్టరీని నిర్మించవద్దని ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి, గత తహసీల్దార్ కరీంకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. అప్పుడు ఫ్యాక్టరీ పనులను నిలిపివేసి, మళ్లీ గత ఐదు రోజులుగా పనులను ఎందుకు ప్రారంభించారని ఫ్యాక్టరీ నిర్మాణ స్థలంలో రైతులు ఆందోళనకు దిగారు. ఫ్యాక్టరీ పనులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ఫ్యాక్టరీకి సంభందించిన అనుమతి పత్రాలు చూపించాలన్నారు. గ్రామంలో ఎలాంటి తీర్మానం చేయకుండా పనులు ఎలా ప్రారంభిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీతో ఇరు గ్రామాల వాయు కాలుష్యం, జల కాలుష్యం ఏర్పడి ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీని పనులు నిలిపేవరకు పోరాడుతామని పేర్కొన్నారు. రైతుల జీవితాలతో చెలగాటం ఆడాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పొల్దె శ్రీనివాస్, అరుగుల రమణ, కోడె నవీన్, కుంట గంగారెడ్డి, తెడ్డు గోపాల్, కట్కం రాజారెడ్డి, గోపు రాకేష్, కోడె విజయ్, వసీం, పసుల పవన్, సప్పల నర్సయ్య, ఇసాక్ పాల్గొన్నారు.



ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



గంగాపూర్‌కు ప్రారంభమైన ఆర్టీసీ బస్సు

నవతెలంగాణ-కడెం

ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన గంగాపూర్, కోర్రతండా, రాణిగూడెం, గంగాపూర్ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు శాంతాచంద్రాస్, సదార్‌లాల్, భీమ్‌భాయి ఆనందరావు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులతో కలిసి బస్సు సేవలను ప్రారంభించారు. గత వర్షకాలంలో గంగాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు చెడిపోవడంతో ఆర్టీసీ అధికారులు గంగాపూర్ గ్రామానికి బస్సు నిలిపివేశారు. కాగా చలికాలం కావడంతో గంగాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మరమ్మతులు చేయడంతో ఆర్టీసీ అధికారులు బస్సు సేవలను గంగాపూర్ గ్రామానికి కల్పించారు. గంగాపూర్ బస్సు నడవడంతో దాదాపు 12 గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించడం జరిగిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 గంటలకు సాయంత్రం ఐదు గంటలకు రెండు ట్రిప్పులు కడెం నుంచి గంగాపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆర్టీసీ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యుద్వీర్‌సింగ్‌పై అక్రమ నిర్బంధం ఆపాలి



వినతిపత్రాన్ని అందజేసిన వామపక్ష రైతు నాయకులు

- రైతులపై కేసులు ఎత్తివేయాలి

నవతెలంగాణ-నిర్మల్

దేశ రైతు సంఘం నాయకుడు యుద్వీర్ సింగ్‌పై అక్రమ నిర్బంధం ఆపాలని, అతని ప్రయాణ నిషేధాన్ని ఎత్తివేయాలని ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షులు నందిరామయ్య అన్నారు. సోమవారం సంయుక్త కిసాన్ మోర్చా దేశ వ్యాప్త పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దేశవ్యాప్తంగా రైతు సంఘాల నాయకులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని నిర్బంధం ఆపాలన్నారు. రైతులకు నష్టం వాటిల్లే చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలలకు పైగా ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్యమం జరిగిందని గుర్తు చేశారు. ఈ ఉద్యమానికి తలోగ్గిన మోడీ సర్కార్ రైతు ఉద్యమ నాయకులకు రాతపూర్వకంగా నల్ల చట్టాలు రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. రైతు ఉద్యమ నాయకులపై దేశవ్యాప్తంగా కేసులన్నీ ఎత్తివేస్తామని, ఎంఎస్పీ చట్టాన్ని అమలు చేస్తామని చెప్పి రైతాంగాన్ని మోడీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అలాగే బీకేఎస్ రైతు నాయకుడైన యుద్వీర్ సింగ్‌పై అక్రమ కేసులు, అక్రమ నిర్బంధం, ప్రయాణ నిషేధం కొనసాగించడం దుర్మార్గమైన విషయం అన్నారు. వెంటనే నిర్బంధం ఆపాలని, ప్రయాణాల నిషేధాలు ఎత్తివేయాలని ఈ మేరకు సంయుక్త కిసాన్ సంఘం ఆధ్వర్యంలో సంబంధిత లేఖలను దేశవ్యాప్తంగా కలెక్టర్ల ద్వారా మెమోరాండాలు భారత రాష్ట్రపతికి పంపించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ఎన్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగేల్లి నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, బర్కుంట గంగారాం, చందుల సాయికిరణ్, నవీన్, అభిషేక్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నిర్లక్ష్యంతోనే ఎయిర్ ఫోర్స్ స్టేషన్ రాలేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాలూరి గోవర్ధన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే నిర్లక్ష్యంతోనే ఎయిర్ ఫోర్స్ స్టేషన్ రాకుండా పోయిందని, ఫలితంగా ఆదిలాబాద్ అభివృద్ధి ఆగిపోయిందని డీసీసీబీ డైరెక్టర్, సీనియర్ నాయకులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రజాసేవా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013-14లో ఎయిర్ ఫోర్స్ స్టేషన్ కోసం అప్పటి కలెక్టర్ ప్రపోజల్ పెట్టారన్నారు. మూడు నెలల్లోనే సర్వే పూర్తి చేసి 369 ఎకరాల భూసేకరణ చేపట్టారన్నారు. ఆ తర్వాత దాన్ని పెంచి 1500 ఎకరాల భూ సేకరణకు ప్రతిపాదనలు పంపారని తెలిపారు. రక్షణశాఖాధికారులు అనుమతులు సైతం ఇచ్చినప్పటికీ ఇక్కడి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం కారణంగానే ఎయిర్ ఫోర్స్ స్టేషన్ ఏర్పాటుకాలేదని అన్నారు. కేసీఆర్‌కు ఉత్తర తెలంగాణపై నిర్లక్ష్యం మూలంగానే ఆదిలాబాద్ అభివృద్ధికి దూరమైందన్నారు. ఎయిర్ ఫోర్స్ స్టేషన్ ఏర్పడినట్లయితే దేశంలోనే ఆదిలాబాద్‌కు ప్రత్యేకత ఉండేదన్నారు. కానీ ఐదు వేల కోట్ల నిధులతో చేపట్టాల్సిన ప్రాజెక్టు ఇప్పుడు రాకుండా పోయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుంటానని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారని, అది నెరవేరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ముగిసిన తాళ సప్తమి వేడుకలు

నవతెలంగాణ-కుభీర్



మండల కేంద్రంలోని విఠలేశ్వర్ ఆలయంలో గత 7రోజుల నుంచి కొనసాగుతున్న తాళ సప్తమి వేడుకలు సోమవారం ముగిశాయి. ఆలయ కమిటీ గ్రామస్తుల ఆధ్వర్యంలో విఠల్ రుక్మిణి దేవతల మూర్తులకు అభిషేక కార్యక్రమం చేసి గ్రామంలో ప్రధాన వీధుల గుండా విఠల్ రుక్మిణి విగ్రహాలకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయానికి తీసుకువచ్చి జాతర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు నారా పరుశురాం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఠలేశ్వర్ ఆలయం చాలా పురాతనమైనదని అన్నారు.ప్రతి ఏడాది కార్తీక మాసంలో సప్తమి వేడుకలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ వేడుకలకు గ్రామంలో ఉన్న యాదవ సంఘం సభ్యులు, మున్నూరు కాపు సంఘం సభ్యులు, ఆర్యవైశ్యులు అందరూ కలిసి ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నూతనంగా ఎన్నికైనా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మీరా విజయ్ కుమార్, బోయిడి విఠల్, వివేకానంద, దత్త్రి పుప్పాల పీరాజి నగలింగం, వ్యాపార వేత్తలు సంతోష్, వెంకటేష్, ఆనంద్, సాయినాథ్, మండల ప్రజలు నాయకులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారత కేంద్రం నిర్వహకులు కృష్ణవేణి, కోటేశ్వర్ అన్నారు. సోమవారం పట్టణంలోని వికలాంగుల కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలకు, అంగన్‌వాడీ టీచర్లకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనార్థాలను వివరించారు. ఈ సందర్భంగా మహిళల కోసం ప్రభుత్వాలు కల్పిస్తున్న సదుపాయాలను పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

వికలాంగులకు ఇండ్లు కేటాయించాలి



నవతెలంగాణ-బోథ్

వికలాంగులకు ఇండ్లు కేటాయించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు షేక్ మహబూబ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు రూ.6వేలు పెన్షన్ ఇవ్వాలని అన్నారు. బోథ్ మండల కేంద్రంలోని వికలాంగులకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వికలాంగుల సంక్షేమం కొరకు పలు సంక్షేమాభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్ అర్హులైన వికలాంగులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మోతి రాజేశ్వర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

సోన్ మండలం సిద్దులకుంట గ్రామంలోని సిద్దేశ్వర ఆలయాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డిని శాలువాతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నల్లా ఇంద్రకరణ్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, నర్సారెడ్డి, మార గంగారెడ్డి, గంగారెడ్డి, చందర్‌రెడ్డి, ఫనింధర్‌రావ్, భూమేష్, మధుసూధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పరమేశ్వర్, ముత్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

నవతెలంగాణ-దిలావర్‌పూర్



అప్పుల బాధ భరించలేక యువరైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మాడేగాం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై యాసిర్ అరాఫత్ తెలిపిన వివరాల ప్రకారం.. సుంకరి భీమేష్ (32) జీవనోపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లి మూడు సంవత్సరాల కింద స్వదేశానికి తిరిగి వచ్చాడు. తమ గ్రామంలోని మిషన్ భగీరథ ప్లాంట్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ, వ్యవసాయం చేసేవాడు. గత మూడు సంవత్సరాలుగా పంట దిగుబడి సరిగా రాకపోవడం అప్పులు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలా అని భార్యతో తరుచూ విచారిస్తూ కుంగిపోయేవాడు. ఆదివారం రాత్రి సమయంలో తన భార్య సుమలత వంట గదిలో వంట చేస్తుండగా భర్త హఠాత్తుగా తలుపులు వేసుకోవడం గమణించి ఆమె మామకు సమాచారం అందించింది. తలుపు తెరిచి చూడగా ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, కూతురు నక్షత్ర, కుమారుడు రేవంత్ ఉన్నారు.

రేపు వికలాంగులకు క్రీడోత్సవాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 13న జిల్లాస్థాయి వికలాంగుల క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మహిళా, శిశుసంక్షేమ, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖాధికారి మిల్కా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10 సంవత్సరాల నుంచి 16 సంవత్సరాల (జూనియర్స్), 17సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల (సీనియర్స్) వికలాంగులకు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ క్రీడోత్సవాల్లో పరుగుపందెం, షాట్‌పుట్, చెస్, ట్రైసైకిల్, వీల్‌చైర్ రేస్, షాట్‌పుట్, జావెలిన్, క్యారమ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వికలాంగులందరూ పాల్గొనాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ఓల్డ్ కాలనీ ఏరియాలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు టౌన్ ఎస్సై అంజయ్య తెలిపారు. మృతుడి వయస్సు దాదాపు 45 నుంచి 50 సంవత్సరాల వరకు ఉంటుందని తెలిపారు. ఆ కాలనీ చౌరస్తాలో గుర్తుతెలియని వ్యక్తి కింద పడి ఉండగా, కాలనీవాసుల సమాచారం మేరకు వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే టౌన్ సీఐ బి స్వామి 8712670507, ఎస్సై అంజయ్య 9866427288 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

మద్యం షాపు తరలించాలని వినతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



మండలంలోని పంచశీల్‌నగర్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మద్యం షాపును వేరే చోటికి మార్చాలని డిమాండ్ చేస్తూ పలువురు మహిళలు సోమవారం ఎక్సైజ్ సీఐ మంగమ్మకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మద్యం తాగడానికి వచ్చిన వాళ్ళు మహిళల పట్ల అసభ్యంగా ప్రవరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనావాసాల నుంచి మద్యం షాపును తరలించాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు
- కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. ఆయన ప్రమాణ స్వీకారం చేసి నియోజకవర్గానికి వస్తున్న నేపథ్యంలో ఆదివారం రాత్రి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కరీంనగర్ చౌరస్తా నుంచి ఉత్కూరు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో భారీ ఎత్తున ఫ్లెక్సీలు కట్టి స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ మీ, ప్రేమ అబిమానమే నన్ను గెలిపించయని, ఇంతటి భారీ విజయం అందించిన నియోజకవర్గం ప్రజలకు రుణపడి ఉంటానని చెప్పారు. డబ్బు సంపాదన కోసం కాకుండా నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగుతనని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పింగళి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు చింతా అశోక్, ఎంపీపీ అన్నం మంగ, చిన్నన్న పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశాల పరిశీలన



నవతెలంగాణ-దండేపల్లి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు కొనసాగుతున్న ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ స్థాయి సమావేశాలను సోమవారం విద్యాశాఖ జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు వారు బోధిస్తున్న విధానం బోధలను పాటిస్తున్న మెలకువలను పరిశీలించారు. బోధనను నైపుణ్యంతో బోధించడం ద్వారా విద్యార్థులు కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం ఉందని అన్నారు. ఉపాధ్యాయులు తమ బోధన అనుభవాలను తోటి ఉపాధ్యాయులతో పంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజ్ కుమార్, చిన్నయ్య, సుదర్శన్, రాజు, ప్రసాద్, శ్రీనివాస్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేవీకేలో చేపల పెంపకంపై శిక్షణ

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి కేవీకేలో ఐదు రోజులపాటు నిర్వహించే చేపల పెంపకం శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనడానికి మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి ఆసక్తి చూపిన రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.కోట శివకృష్ణ అధ్యక్షత వ్యవసాయ అనుబంధ రంగాలలో కృషి విజ్ఞాన కేంద్రం పాత్ర గురించి వివరించారు. మొదటి రోజు కార్యక్రమానికి సబ్జెక్టు ఎక్స్పర్ట్‌గా విచ్చేసిన మత్స్య విభాగ శాస్త్రవేత్త డా. మహేష్ రైతులకు వివిధ రకాల చేపల జాతులు, వాటిని పెంచే విధానంపై అవగాహన కల్పించారు. చేపలు పెంపకానికి స్థలం ఎంపిక వాతావరణ. పరిస్థితులు చేపలకు దానా దిగుబడి మార్కెటింగ్ గురించి తెలిపారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సిబ్బందితో పాటు 25 మంది శిక్షణ పొందుతున్న రైతులు పాల్గొన్నారు.

హక్కులు సాధించిన టీబీజీకేఎస్‌ను గెలిపించాలి



నవతెలంగాణ-మందమర్రి

కార్మికుల హక్కులను సాధించిన టీబీజీకేఎస్‌ను గెలిపించాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ నెల 27న జరుగనున్న సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో భాగంగా సోమవారం మందమర్రి కేకే-1 వర్క్ షాప్‌లో టీబీజీకేఎస్ నాయకులు గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసిన సంఘాలు ఒకవైపు, కార్మికుల హక్కులను సాధించిన టీబీజీకేఎస్ సంఘం ఒకవైపు నిలిచిందని, రానున్న ఎన్నికల్లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్, సెంట్రల్ ఉపాధ్యక్షుడు బడికల సంపత్, బెల్లంపల్లి రీజియన్ సెక్రెటరీ ఓ రాజశేఖర్, పెండ్రీ రాజీరెడ్డి, బిక్షపతి, కొండల రావు, ఇప్ప సమ్మయ్య, తోట రాజిరెడ్డి, బిళ్ల మాధవ రెడ్డి, ముత్యాల ఈశ్వర్, ఏడుకోల శ్రీనివాస్, నాగేశ్వర రావు, ప్రభాకర్, చక్రపాణి పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో అధ్యాపకుడి క్రమబద్ధీకరణ..!

- పొంతన లేని సమాధానాలు చెబుతున్న అధికారులు
- కమిషనర్ ఉత్తర్వులు బయటపెట్టని వైనం
- బెజ్జూర్ ప్రభుత్వ కళాశాలలో కొనసాగుతున్న తతంగం

నవతెలంగాణ-బెజ్జూర్


ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేసిన విషయం తెలిసిందే. ఈ నియామకంలో కొంత మంది నకిలీ ధ్రువీకరణ పత్రాలు పెట్టినట్లు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరారు. దీంతో కాంట్రాక్టు అధ్యాపకుల సర్టిఫికెట్ల మీద పూర్తిస్థాయి పరిశీలన చేసి ఆయా జిల్లాలో నకిలీ ధ్రువీకరణ పత్రాలు బయటపడ్డ వారిని విధుల నుంచి తొలగించి క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. తాజాగా బెజ్జూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటువంటి సంఘటన చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చినప్పటికీ అధికారులు దీన్ని గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నకిలీ సర్టిఫికెట్లపై అధికారుల గోప్యం

స్థానిక కళాశాలలో గణిత శాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్న నాగరాజు గత మే 4వ తేదీన అందరితోపాటు రెగ్యులర్ అయ్యాడు. అయితే ఉన్నతాధికారులు చేసిన ఎంక్వయిరీలో సదరు అధ్యాపకుడు పోస్ట్ గ్రాడ్యుయేషన్ ధ్రువీకరణ పత్రాలు నకిలీవి పెట్టినట్లు నిర్ధారించారని, దీనితో ఆయనను ఉద్యోగం నుండి తొలగించి క్రిమినల్ కేసు నమోదు చేయాలని గత నెల 29వ తేదీన కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ పది రోజులు గడుస్తున్న నేటికి ఉన్నతాధికారులు ఉత్తర్వులు బయటికి పొక్కనీయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉన్నతాధికారుల పొంతన లేని సమాధానాలు

సదరు అధ్యాపకునిపై చర్యలకు సంబంధించి





డీఐఈఓ శంకర్‌ను వివరణ కోరగా గత నెల 29న చర్యలకు సంబంధించి కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయని కళాశాల ప్రిన్సిపాల్‌కు రావలసిన ఉత్తర్వులకు సంబంధించి ఎదురు చూస్తున్నామని తెలిపారు. స్థానిక ప్రిన్సిపల్ రాజయ్యను వివరణ కోరగా అధ్యాపకునిపై కేసు నమోదు కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళితే కమిషనర్ నుండి వచ్చే ఒరిజినల్ ఉత్తర్వులు ఉంటేనే కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపాడని వివరణ ఇచ్చారు. స్థానిక ఎస్సైని వివరణ కోరగా ప్రిన్సిపల్ కేసు నమోదు కోసం తనను సంప్రదించలేదని తెలిపారు. దీనితో ఉన్నతాధికారుల మధ్య సమాధానాలు పొంతన లేకుండా పోయింది.

నేటికీ వెలుగులోకి రాని వైనం

స్థానిక కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుని తొలగింపు ఉత్తర్వులు వచ్చి పది రోజులు గడుస్తున్నప్పటికీ నేటికీ అధికారులు గోప్యంగా ఉంచుతున్నారని తెలుస్తోంది. ఎంతోమంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న సందర్భంలో ఇటువంటి నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగం పొందడం నిరుద్యోగులకు అన్యాయం చేసినట్టేనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సదరు అధ్యాపకుడు విధుల్లో ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. దీని కోసమే ఉన్నతాధికారులు నేటి వరకు కూడా ఉత్తర్వులు బయటికి రానియ్యలేదని తెలుస్తోంది.

పూర్వ వైభవం దిశగా కాంగ్రెస్ అడుగులు

- డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌కు ఎమ్మెల్సీ అవకాశం..?
- జిల్లాపై అధిష్టానం ప్రత్యేక దృష్టి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో కాంగ్రెస్ పూర్వ వైభవం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, జిల్లాలో ఉన్న రెండు నియోజకవర్గాల్లో కూడా అభ్యర్థులు ఓడిపోవడంతో రానున్న రోజుల్లో జిల్లాలో అధికారులతో పనులు చేయించడానికి ప్రభుత్వ కార్యక్రమాలు పకడ్బందీగా అమలు కావడానికి నాయకుల అవసరం ఉంది. అయితే జిల్లాలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కాంగ్రెస్‌కు చెందిన వారు లేకపోవడంతో ప్రోటోకాల్ అడ్డువచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇబ్బందులు కాకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలని అధిష్టానం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

డీసీసీ అధ్యక్షుడికి ఎమ్మెల్సీ ఇచ్చే ఛాన్స్..?

ప్రస్తుతం రాష్ట్రంలో ఎమ్మెల్యేతో ఎన్నికయ్యే ఎమ్మెల్సీతో పాటు, పట్టభద్రులు ఇతర ఎమ్మెల్సీలు ఖాళీ ఉండగా, వీటిలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌కు అవకాశం ఇచ్చే ఛాన్స్ ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌కి జిల్లాలో



మూలస్తంభంగా ఉన్న ఆయనకు పదవి ఇవ్వడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇదే విషయం ఆయనను అడగగా అదినాయకత్వం సూచనలు పాటించడానికి పార్టీని అభివృద్ధి చేయడానికి సర్వదా సిద్ధంగా ఉంటానని తెలిపారు.

జిల్లాపై అధినాయకత్వం ప్రత్యేక దృష్టి

జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోవడంతో రానున్న రోజుల్లో అభివృద్ధి పనులతో పాటు అధికారులతో ప్రోటోకాల్ విషయంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా అధినాయకత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీనిలో భాగంగా జిల్లాకు ఒక మంత్రిని ఇన్‌ఛార్జిగా నియమించడంతోపాటు ఎమ్మెల్సీ పదవి జిల్లాకు ఇవ్వడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది. ఒకవేళ ఇది సాధ్యం కాకుంటే ప్రస్తుతం గెలిచిన ఎమ్మెల్యేల చేరికపై కూడా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అయితే ఎమ్మెల్యే వివేక్ ఇప్పటికే ఇతర పార్టీల నాయకులను చేర్చుకునే ప్రసక్తే లేదని ప్రకటించడంతో, రానున్న రోజుల్లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై సర్వత్ర ఆసక్తి నెలకొంది.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తుక్కు సామాగ్రి కొనుగోలు చేస్తానంటూ ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని నమ్మించి, మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన పట్టణంలోని సర్సిల్క్ ఎఫ్ కాలనీలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని ఓ వ్యక్తి ఆ ప్రాంతంలో తుక్కు సామాగ్రి కొనుగోలు చేస్తానంటూ తిరుగుతుండగా, వృద్ధురాలు డి.శకుంతల(85) తమ వద్ద ఉన్న తుక్కు ఇనుప సామాగ్రి విక్రయించేందుకు ఆ వ్యక్తిని పిలిచింది. పలు ఇనుప సామాగ్రిని ఆ వ్యక్తికి అప్పగించగా, మరి కొంత సామాగ్రి ఇంటి వెనుక నుంచి తీసువచ్చేందుకు ఇంట్లోకి వెళ్ళింది. ఈ విషయాన్ని గమనించిన ఆ వ్యక్తి తమ వద్ద ఉన్న ఓ చిన్న ఇనుప రాడుతో ఆ వృద్ధురాలిని చంపుతానంటూ బెదిరించగా ఆమె కేకలు వేసింది. దీంతో నోటిని నొక్కి కింద పడేసి, మెడలోని మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని ద్విచక్రవాహనంపై పరారయ్యాడు. వృద్ధురాలి ఇంటి ఆవరణకు వచ్చిన ఇరుగుపొరుగు వారికి విషయం తెలపగా సత్వరమే కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించారు. వృద్ధురాలి కంటి, దవడ చేతులకు స్వల్పగాయాలు కాగా, కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించి, ప్రాథమిక చికిత్సలు



చేయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టౌన్ ఎస్‌హెచ్‌ఓ స్వామి తెలిపారు.

మానవ హక్కులపై అవగాహన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మానవ హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సమన్వయ కర్త బి.శారద మాట్లాడుతూ పుట్టిన ప్రతీ వ్యక్తి కొన్ని హక్కులను కలిగి ఉంటారని వాటిని తెలుసుకొని వాటిపట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జెండర్ స్పెషలిస్ట్ బి.రాణి మాట్లాడుతూ మహిళలు విద్య ద్వారానే తమ హక్కుల గురించి తెలుసుకుంటారని విద్యార్థినులు తమకున్న హక్కుల గురించి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.లక్ష్మినరసింహం మాట్లాడుతూ 1948 డిసెంబరు 10న ఐక్యరాజ్యసమితి విశ్వమానవ హక్కుల ప్రకటన జారి చేయడం ద్వారా మానవ హక్కులకు విశేష ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల మహిళా సాధికారత విభాగం ఇన్‌ఛార్జి ఆర్.కృష్ణవేణి, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డా.టేమాజీ, ఆర్థిక, అక్షరాస్యత సలహాదారు జె.సాగర్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల వద్ద భగీరథ పైపులైన్ లీకేజీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బెండర గ్రామ సమీపంలోని మోడల్ డిగ్రీ కళాశాల వద్ద కళాశాలకు నీటి సరఫరా చేసే పైప్ లైన్ లీకేజీతో నీరు వృధా అవుతోంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కనకయ్య మాట్లాడుతూ తమ కళాశాలకు వస్తున్న భగీరథ పైప్ లైన్ ఎప్పుడు పగిలిపోతుండడంతో నీరు అందడం లేదని శాశ్వత ప్రాతిపదికన నీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నేషనల్ హైవే పనులు నడుస్తున్న నేపథ్యంలో అనునిత్యం పైపులు పగులుతున్నాయని దీనితో నీరు కళాశాలకు రావడం లేదన్నారు. గతంలో పగిలిన పైపును హైవే అధికారులతో మాట్లాడి బాగు చేయించామని ప్రస్తుతం అదే పరిస్థితి తలెత్తిందని, వెంటనే అధికారులు స్పందించి పైపులైన్ బాగు చేయించాలని కోరారు.



పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

టాస్క్‌ఫోర్స్ అధికారులకు అందిన పక్కా సమాచారం మేరకు మండలంలోని అగర్‌గూడ గ్రామంలో టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు చేపట్టగా గ్రామానికి చెందిన ఆదేటి సత్యం ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మూడున్నర క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యాన్ని పెంచికల్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేసినట్లు, పీడీఎస్ బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ రాణాప్రతాప్ తెలిపారు. తనిఖీలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్‌కుమార్, సిబ్బంది మధు, రమేష్, సంజీవ్ పాల్గొన్నారు.

'సేంద్రియ ఎరువులతో నేలసారం పెరుగుతుంది'

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సేంద్రీయ ఎరువులతో నేల సారం పెరుగుతుందని ఏఈఓ రాము తెలిపారు. మండలంలోని పర్సునంబాల గ్రామంలో వాసన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో యాపల్ పాటి రైతులకు నిర్వహించిన క్షేత్ర ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులు వాడకంతో నేలలో సారం పెరుగుతుందన్నారు. ప్రస్తుతం ఎరువుల వాడకం పెరిగిందని దానితో పంట దిగుబడి పెరిగినప్పటికీ నేలసారం తగ్గుతుందన్నారు. సేంద్రీయ పద్ధతిలో రైతులు అలవాటు చేసుకుంటే పంట దిగుబడి పెరుగుతుందని తెలిపారు. పంట విధానంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో వాసన్ సిబ్బంది జయవర్ధన్, తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడి రాజీనామా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రిజిస్ట్రేషన్ నెంబర్ 98/2023కి అనుబంధంగా ఉన్న పద్మశాలి సేవ సంఘ అధ్యక్షుడు చెన్నూరి అశోక్ రాజీనామా చేస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పద్మశాలీలలో రెండు సంఘాలు కావడంతో పద్మశాలిలలో వర్గాలు ఏర్పడి బలం తగ్గిందని దీన్ని దృష్టిలో ఉంచుకొని తాను పదవికి రాజీనామా చేస్తున్నట్లు, పద్మశాలీల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంట్లో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్ లో చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సందీప్‌నగర్‌లో నివాసం ఉంటున్న సాబీర్ ఖాన్(54)కు భార్య జాకిర బేగం, వీరికి కుమారుడు సమీర్ ఉన్నాడు. సాబీర్‌ఖాన్ మద్యానికి బానిసై ఇంట్లో ఉన్న వస్తువులను అమ్మి మద్యం సేవించేవాడు. భార్య ఎన్నిసార్లు వారించిన వినలేదు. చివరికి గత 20 రోజుల క్రితం భార్య జాకిర బేగం కుమారులతో కలిసి తన పుట్టింటికి వెళ్ళిపోయింది. మనస్తాపానికి గురైన సాబీర్ ఖాన్ పక్కనే ఉన్న రేకుల షెడ్డులో ఉరేసుకున్నారు. ఇరుగుపొరుగువారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు పరిస్థితి పరిశీలించి పోలీసులకు సమాచారం అందించగా, సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా : వ్యక్తి మృతి



నవతెలంగాణ-నస్పూర్

కారు బోల్తా పడి ఒకరి మృతి చెందిన సంఘటన సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంపూర్ కాలనీకి చెందిన సతీష్ అనే వ్యక్తి తన ఇంటి ప్రక్కన ఉండే ఓంట్రా శివ శంకర్ (32)ను ఆదివారం రాత్రి కారులో బయటకు తీసుకు వెళ్ళడని, జాతీయ రహదారి నెం.363 దొరవారి పల్లె సమీపంలో కారు బోల్తా పడటంతో శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. కారు అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లనే కారు బోల్తా పడిందని పేర్కొన్నారు. శివశంకర్ బావమరిది గుమాస కుమారస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

ఐఎన్టీయూసీలో పలువురి చేరిక



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఐఎన్టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తేజావత్ రాంబాబు, సీహెచ్‌పీ పిట్ సెక్రెటరీ సెనిగారపు రాములు ఆధ్వర్యములో సోమవారం ఆర్‌కేసీహెచ్‌పీ గనిపై పలువురు టీబీజీకేఎస్ నాయకులు సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు సుమారు 35మంది ఐఎన్టీయూసీలో చేరారు. వీరిని ఐఎన్టీయూసి సీనియర్ వైస్ ప్రెసిడెంట్, రాజమొగిలి, వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సమ్మయ్య, పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న సింగరేణి గుర్తింపు సంఘ ఎన్నికల్లో ఐఎన్టీయూసీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మందమర్రి డివిజన్ వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య, కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, ఫుల్లూరి లక్ష్మణ్, రామకృష్ణాపూర్ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, మహంకాళి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దనపల్లి గ్రామంలో యువకుడిపై దాడి చేసిన కేసులో ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు కాసిపేట ఎస్సై గంగారాం తెలిపారు. పెద్దనపల్లి గ్రామానికి చెందిన చండే నవీన్ అనే యువకుడిని అదే గ్రామానికి చెందిన పల్లె పెద్దులు, సోమని గణేశ్ అనే ఇద్దరు యువకులు పాత గొడవల కారణంగా బీరు బాటిల్‌తో దాడి చేసిన విషయంపై చండే నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను రిమాండ్కు పంపినట్లు వివరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

మంగళవారం | డిసెంబర్ 12, 2023 | www.navatelangana.com

డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ - రెబ్బెన



రెబ్బెన గ్రామానికి చెందిన డ్రైవర్ మిట్ట రామన్న ఇటీవల అనారోగ్యంతో మరణించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సింగరేణి కాలరీస్ కోల్ ట్రాన్స్‌ఫోర్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) గోలేటి బ్రాంచ్ తరపున రూ.13,150 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ గౌరవధ్యక్షుడు బోగె ఉపేందర్, అధ్యక్షులు అరికిల్ల స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, ఉపాధ్యక్షులు రవిప్రసాద్‌గౌడ్, లచ్చన్న, డ్రైవర్ చందు పాల్గొన్నారు.

బస్సు పునరుద్ధరించాలి

నవతెలంగాణ-మందమర్రి



ఆవడం బస్సును పునరుద్ధరించాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సోమవారం తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక అధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ మంచిర్యాల నుండి ఆవడం వరకు గతంలో ఆర్టీసీ బస్సు నడిచేదని, ఇప్పుడు ఆ బస్సు నడవకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. విద్యార్థులు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఐటీఐలతో పాటుగా జిల్లా కేంద్రంలోని అనేక కళాశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య



నవతెలంగాణ - సిర్పూర్(టి)

మండలంలోని లోనవెల్లి గ్రామానికి చెందిన దుర్గం పోచం(62) మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ దీకొండ రమేష్ తెలిపారు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోచం భార్య 15 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. వీరికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు గతంలో, ఇటీవల పెద్ద కుమారుడికి వివాహం కావడంతో వేరుగా ఉంటున్నాడు. చిన్న కుమారుడు నవీన్ రెండు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకొని కిరాణ దుకాణం పెట్టుకొని జీవిస్తున్నాడు. రెండో కుమారుడు చక్రికి వివాహం కాలేదు. ఈ క్రమంలో పెద్ద కుమారుడికి, చిన్న కుమారుడికి ఆస్తి తగాదాలతో తరచుగా గొడవలు జరుగుతుండేవి. దీంతో పోచం ఇద్దరు కుమారులకు సర్దిచెప్పినా వినకపోవడంతో మద్యానికి బానిసై ఆదివారం మరోసారి కుమారుల మధ్య గొడవ జరుగగా తండ్రి ఇద్దరికి చెప్పినా వినడం లేదని తీవ్ర మనస్తాపానికి గురై ఉరేసుకున్నాడు. పెద్ద కుమారుడు ప్రవీన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా భారతీయ భాష ఉత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో మహాకవి సుబ్రహ్మణ్య భారతి జయంతిని పురస్కరించుకొని సోమవారం భారతీయ భాష ఉత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో భాష పరిజ్ఞానాన్ని పెంపొందించే ఉద్దేశంతో సంస్కృతం, హిందీ, తెలుగు, మరాఠీ, తమిళం, బెంగాలీ, ఇంగ్లీష్, భోజ్‌పురి, గుజరాతి, రాజస్థానీ భాషల్లో పాటలు, ఉపన్యాసాలు, నృత్యాలు, సంభాషణలు, కథల పోటీలు నిర్వహించి భాషా సామర్థ్యాన్ని పరీక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు, పాఠశాల సిబ్బంది సత్యనారాయణ, శారద, శ్రీకాంత్, అమరావతి, దీపక్ పాల్గొన్నారు.

చికిత్స కోసం ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని నెల్కి వెంకటాపూర్ గ్రామానికి చెందిన బొమ్మెన చంద్రమౌళి కుమారుడు ఇటీవలే రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతని కుమారుని చికిత్స నిమిత్తం చంద్రమౌళితో పాటు పదవ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు అంతా కలిసి ఆర్థిక సహాయం అందజేశారు. శాస్త్ర చికిత్స కొరకు రూ.ఐదు లక్షల వరకు ఖర్చు అవుతుండగా తమ వంతుగా రూ. రూ.43,300 ఆర్థిక సాయం అందించినట్లు పేర్కొన్నారు. ఆపద సమయంలో మిత్రులకు అండగా నిలుస్తున్న వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకున్న 1996-97 పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని రద్దు చేయాలి



నవతెలంగాణ-జన్నారం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని జన్నారం మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు నసీరుద్దీన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఆటో, టాటా ఏసీ జీప్ డ్రైవర్లు, తమ వాహనాలతో ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందించారు. ఈ ఉచిత బస్సు పథకంతో టాటా ఏసీ, ఆటో, జీప్, డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆ వాహనాలు రోడ్డుపై సక్రమంగా నడవకపోవడంతో వారికి సంబంధించిన గ్యారేజీలు దుకాణాలు, దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఈ ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

ఎండిఎం కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఐఎన్టీయూసీ జిల్లా ఇన్‌చార్జి అల్లూరి లోకేష్ కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి డిఆర్‌ఓ సురేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడం గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. కార్మికులు గత ప్రభుత్వంలో ప్రశ్నించే పరిస్థితి లేకుండా ఉండేదని ఆరోపించారు. అల్పాహార పథకంలో కార్మికులపై అదనపు భారం మోపిందన్నారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాపర్తి సత్యనారాయణ, రామగిరి కుమార్, వెంకన్న, శ్రీనివాస్, మంగుబాయి, సుగుణ, కళావతి, రేణుక పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తూ పకడ్బందిగా ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. ఓటరు ధృవీకరణ, ఓటరు జాబితా తయారీ వంటి అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల నమోదుకు 1 జనవరి 2024 ప్రామాణికంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చోటు కల్పించేలా కార్యాచరణ అమలు చేయాలన్నారు. ఓటరు జాబితా సవరణ 2024కు ముందు పోలింగ్ కేంద్రంలో 1450 కంటే ఎక్కువ ఓటర్లు ఉండకుండా పోలింగ్ కేంద్రాల పునర్‌వ్యవస్థీకరణ చేయాలని, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు జాబితాలో మరణించిన ఓటర్ల వివరాలు తొలగింపు, పొరపాట్లను పూర్తి స్థాయిలో సవరించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా జాబితా, చిరునామా, పోలింగ్ కేంద్రాల జీఐఎస్ ద్వారా క్యాప్చరింగ్, ప్రత్యామ్నాయ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు జాబితా చేపట్టిన సమాచారాన్ని సంబంధిత అధికారులు పరిశీలించాలన్నారు. 6 జనవరి 2024న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి, 22 జనవరి 2024 వరకు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. 2 ఫిబ్రవరి 2024 లోగా అభ్యంతరాలను పూర్తి స్థాయిలో పరిష్కరించి, 8 ఫిబ్రవరి 2024న తుది ఓటరు జాబితా రూపొందించాలని ఆదేశించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం ఓటరు జాబితా రూపకల్పన కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్ పాయ్, ఆర్డీఓ స్రవంతి, అధికారులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయిస్తా

- అటవీ ఆంక్షల సడలింపుకు కృషి చేస్తా
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



నవతెలంగాణ-జన్నారం

మండలంలో కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థతోపాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయిస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారి జన్నారం పట్టణానికి వచ్చిన సందర్భంగా ఆయనకు పార్టీ కార్యకర్తలు నాయకులు షాలువా పూలమాలతో ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ కార్యాలయం నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు కార్యకర్తలతో భారీగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గాన్ని గత పాలకులు మరిచారన్నారు. కమిషన్ల కోసమే పనులు చేశారు కానీ అభివృద్ధి చేయలేదన్నారు. ఇక్కడి ప్రజలకు విద్య వైద్యం ఉచితంగా అందే విధంగా కృషి చేస్తామన్నారు. పేదవాడినైనా నన్ను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. నేను పేదల ప్రక్షాళ ఉండి నిత్యం పేదల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ఖానాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి తన వంతు శాయశక్తుల కృషి చేస్తామన్నారు. గత పాలకులు కడెం ప్రాజెక్టును మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. త్వరలోనే కడెం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించి ఆయకట్టు కింద ఉన్న రైతుల పంట పొలాలకు నిరంతరంగా సాగునీరు అందే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రాజెక్టు కింద ఉన్న కాలువలను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ స్కీములను తప్పకుండా అమలు చేసి పేద ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్, మత్స్య శంకరయ్య, మామిడిపల్లి ఇంద్రయ్య, దుమల్ల రమేష్, మంద రాజేష్, రియాజుద్దీన్ పాల్గొన్నారు.

జనవరిలో పంచాయతీ ఎన్నికలకు సిద్ధమవ్వాలి

- అధికారులతో కలెక్టర్ సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసెంబ్లీ ఎన్నికలను జిల్లాలో సమర్ధవంతంగా నిర్వహించామని, అదే విధంగా జనవరిలో జరిగే పంచాయతీ ఎన్నికలను కూడా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఆయా శాఖల అదికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా విజయవంతంగా పూర్తి చేసినందుకు అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించామన్నారు. అదే స్ఫూర్తితో జనవరిలో పంచాయతీ ఎన్నికలు జరిగే సూచనలున్న నేపథ్యంలో అధికారులు మరింత సమర్థంతంగా నిర్వహించాలన్నారు. ఈనెల చివరి వరకు అధికారుల నియామక ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఎక్కడ కూడా తప్పులకు తావు లేకుండా చూడాలన్నారు. జిల్లాలోని 468 గ్రామపంచాయతీలకు బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరుగుతాయని, అన్ని ఏర్పాట్లు ఇప్పటి నుంచే చేసుకోవాలని సూచించారు.

టీజీజీబీ బ్యాంక్ మేనేజర్‌గా మహేంద్ర కుమార్

నవతెలంగాణ-తాండూర్

తాండూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌గా నరేంద్ర కుమార్ బాధ్యతలు చేపట్టారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి భీమ్గల్ రాజారాంపల్లి బుగ్గారం మంచిర్యాలలో శాఖలలో పనిచేసిన ఆయన సోమవారం తాండూర్ మండలం తంగళ్ళపల్లి హైస్కూల్లో ఆర్థిక సాంకేతిక అక్షరాస్యతపై మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈఓ ప్రభాకర్ హెచ్ఎం మల్లేశం పాల్గొన్న ఈ సమావేశంలో మేనేజర్ మాట్లాడుతూ ప్రజలు తమ ఆదాయ వ్యయలను అంచన వేస్తూ పొదుపు మార్గంలో పయనించాలని తెలిపారు. కుటుంబ సభ్యుల్లో విద్యార్థి స్థాయి నుండేపొదుపు అలవాట్లను పెంపొందించాలని తెలిపారు. ఖాతాదారులు తమ ఆర్థిక లావాదేవీలను నగదు రహితంగా నిర్వహించుకోవాలని సూచించారు. డిజిటల్ లావాదేవీల వల్ల సమయం శ్రమ ఆదా అవుతాయన్నారు. ఖాతాదారులు డిజిటల్ లావాదేవీలు జరిపేటప్పుడు జాగ్రతగా వ్యవహరించాలన్నారు. ఏటీఎం బ్యాంకు ఖాతాల వివరాలను గోప్యంగా ఉంచాలని తెలిపారు. గ్రామీణ బ్యాంకు పరిధిలోని గ్రామాల్లో నగదు లావాదేవీలు నిర్వహించడానికి సీఎస్పీలను నియమించడం జరిగిందన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు ప్రభుత్వ బీమా సౌకర్యాలను కల్పించడం జరిగిందన్నారు. మండలంలోని గ్రామ సంఘాల నాయకులు వ్యాపారస్తులు వ్యవసాయదారులతో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో కళాకారులు మ్యాజిక్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ గీత, తంగళ్ళపల్లి పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు కళాకారులు పాల్గొన్నారు.



రెండు పంటలకు నీళ్లు అందేలా కృషి చేస్తా..



నవతెలంగాణ-కుభీర్

లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రైతులకు రెండు పంటలకు నీళ్లు అందేలా కషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విఠలేశ్వర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఉన్న వ్యవసాయ రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముందుగా రైతులకు రెండు పంటలు వేసుకునేలా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీళ్లు అందించేలా కృషి చేస్తానని అన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూస్తానని అన్నారు. మండల ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో 5600కు పైగా మెజార్టీ ఇవ్వడంతో వారికి ఎప్పుడు రుణపడి ఉంటానని తెలిపారు. అదే విధంగా మండలాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం తొలి సారిగా వచ్చిన ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు బోయిడి విఠల్, గంగాధర్, ఏశాల దత్తత్రి, గంగాశేఖర్, సాయినాథ్, లింగం, ఆలయ కమిటీ అధ్యక్షుడు నారా పరుశురాం, నగేష్, మండల బీజేపీ కార్యకర్తలు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణిని ఆదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి మండలంలో ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఆయశాఖల అధికారులు వారంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రజావాణి దృష్టికి 12 దరఖాస్తులు వచ్చాయని, భూసమస్యలు, డబుల్ బెడ్ రూమ్, పెన్షన్‌లపై దరఖాస్తులు వచ్చాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా అరెస్టు చేసిన వారిని విడిచిపెట్టాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారంలో నక్సలైట్ల పేరుతో అక్రమంగా అరెస్టు చేసిన వృద్ధులైన గంగాధర్ రావు భవానీలను విడుదల చేయాలని మావోయిస్టు రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ పేరుతో ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. వైద్య పరీక్షల కోసం వారిని వెంటనే విడుదల చేయాలని, గోదావరిఖని ఆస్పత్రిలో పనిచేస్తున్న అవినాష్‌ను మావోయిస్టు పేరట అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్టు అందులో పేర్కొన్నారు. రాష్ట్రంలో దొరల పాలన అంతమొందించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూనే, ప్రజా ప్రభుత్వం పేరుతో ఏర్పడిన కాంగ్రెస్ హయాంలో అక్రమ అరెస్టులు చేయకూడదని సూచించారు. కొత్తగా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పోలీసులు అత్యుత్సాహం చూపడంపై రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

శబరిమలకు పయనమైన అయ్యప్ప భక్తులు

నవతెలంగాణ-కౌటాల

కేరళలోని శబరిమల దివ్యసన్నిధికి మండలంలోని తలోడి, కౌటాల గ్రామాలకు చెందిన 23 మంది అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు సోమవారం బయలుదేరారు. గురుస్వామి జయకుమార్ నియర్ అయ్యప్ప మాలధారణ భక్తులకు ఇరుముడి కట్టి శబరిమలకు పంపారు. స్వామివారి సన్నిధికి వెళ్లే వరకు ఇరుముడిని ఎంతో పవిత్రంగా ఉంచుకొని స్వాముల వారి కోరికలను కోరుకుంటారు. శబరిమల హరిహర పుత్రుడికి ఇరుముడి సమర్పించడంతో 41 రోజుల మాల పూర్తవుతుంది. ఈ 41 రోజులు ఎంతో నియమ నిష్టలతో అయ్యప్ప మాలధారణ చేస్తారు. శబరిమలకు బయలుదేరిన భక్తులకు కుటుంసభ్యులు, ఇతర మాలధారణ భక్తులు వారి పాదాలకు వందనం చేసి దక్షణలు చేతపెట్టి పంపించారు.

14న అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 14న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వేడుకలను నిర్వహిస్తున్నట్టు మహిళా, శిశ, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి మిల్కా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేడుకలకు జిల్లాలోని అన్ని కెటగిరీల దివ్యాంగుల అసోసియేషన్ సభ్యులు, నాయకులు, దివ్యాంగ స్వయం సహాయక గ్రూపు సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొనాలని కోరారు.

కొనసాగిన కంకాలమ్మ జాతర

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని స్వయంభు శ్రీకేతేశ్వర, కంకాలమ్మ అమ్మవారి జాతర సోమవారం కొనసాగింది. అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం పెద్ద జాతరలో వేలాదిగా భక్తులు తరలివచ్చారు. రెండో రోజు సోమవారం కూడా జాతరలో భక్తుల తాకిడి భారీగా ఉంది. అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు బారులుతీరారు. భక్తుల కోసం ఆలయ వ్యవస్థాపకుడు, చైర్మెన్ సుల్వ కనకయ్య ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం ఆలయ ప్రత్యేక పూజారి కార్యక్రమంలో ఉత్తర్‌ప్రదేశ్ బృందావనం శ్రీ రాధాకృష్ణ తపోవన ఆశ్రమ పీఠాధిపతి శివరామ స్వామి పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను డీటీఎఫ్ టీం ఆధ్వర్యంలో సోమవారం కూల్చివేశారు. నస్పూర్ శివారులోని సర్వే నెంబర్ 42,52 ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించుకున్న 12 ఇంటి నిర్మాణాలను, ఒక ప్రహరీ గోడను తొలగించారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ బృందం సభ్యులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 42,52,64 గల ప్రభుత్వ భూమిలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టకూడదని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి ఎవరైనా ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదిలా ఉండగా తన ఇంటిని కూల్చి వేస్తున్నారని లవన్ అనే వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. అతని వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్కు తరలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ టి.రమేష్, నస్పూర్ తహసీల్దార్ వనజ, మంచిర్యాల రూరల్ సీఐ టి.సంజీవ్, నస్పూర్ రవి కుమార్, మున్సిపల్ టీపీఎస్ సతీష్ పాల్గొన్నారు.

17న జడ్పీ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 17న జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | డిసెంబర్ 12, 2023 | www.navatelangana.com

ఎమ్మెల్యేను కలిసిన అంగన్‌వాడీలు

నవతెలంగాణ-బోథ్

నూతనంగా ఎన్నికైన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను అంగన్‌వాడీ టీచర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం నేరడిగొండ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో టీఎన్‌జీఓ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సంఘం నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు కే రాధ, మండల అధ్యక్షురాలు ఏ అనిత, ప్రేమ, శాంతి, అరుంధతి, ఇందిరా, లలిత పాల్గొన్నారు.

భరంపూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో...

తలమడుగు: ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను సోమవారం భరంపూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఎమ్మెల్యేతో గ్రామ కమిటీ సభ్యులు పలు అభివృద్ధి విషయాలపై చర్చించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు గడుగు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కార్యదర్శి వినోద్ ఉన్నారు.

కరాటేలో సత్తా చాటిన వేదం విద్యార్థులు

నవతెలంగాణ-బోథ్



కరాటేలో మండల కేంద్రంలోని వేదం పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. 10న కాగజ్‌నగర్‌లో నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్, సిటో రియో కరాటేలో జూనియర్ విభాగంలో సారిక ప్రథమ, ఆరోహి ద్వితీయ బహుమతి, అలాగే బాలికల సీనియర్ విభాగంలో శ్రీనిధి ప్రథమ, మహాన్వి రెడ్డి ద్వితీయ బహుమతి, బాలుర సీనియర్ విభాగంలో సాయి కిరణ్ ప్రథమ, ధృవ్ ద్వితీయ బహుమతి సాధించారు. ప్రతిభ కబనబర్చిన విద్యార్థులు పాఠశాల యాజమన్యం అభినందనలు తెలిపింది.

సుదీర్ఘ విరామం తర్వాత ప్రజావాణి ప్రారంభం

- తరలివచ్చిన అర్జీదారులు
- వినతులను పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశం



లర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో రెండు నెలల సుదీర్ఘ విరామం తర్వాత ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగం తిరిగి యథావిధిగా ప్రారంభమైంది. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా రెండు నెలలుగా ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని నిర్వహించలేదు. ఎన్నికలు పూర్తైన నేపథ్యంలో తిరిగి ప్రజావాణి విభాగాన్ని నిర్వహించగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. సుమారు రెండు నెలల అనంతరం ప్రారంభమైన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో సమర్పించారు. అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధరణి, ఆసరా, రెండు పడక గదుల ఇండ్లు, రెవెన్యూ శాఖలకు సంబందించిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులు సకాలంలో పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వాటిని అందించారు. అనంతరం పెండింగ్ అర్జీలపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులపై నమ్మకంతో ఇచ్చే వాటిపై నిర్లక్ష్యం చేయకుండా పరిష్కార మార్గాలను అన్వేశించాలన్నారు. ఎదైన సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అర్జీలపై తీసుకుంటున్న చర్యలను అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు. అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ సమస్యలపై తమగోడును విన్నవించుకునేందుకు ప్రజలు భారీగా తరలిరావడంతో గ్రీవెన్స్ సెల్ కోలాహలంగా మారింది. ఎటూ చూసినా అర్జీదారుల సందడి కన్పించింది.

యూడైస్ ప్లస్ పోర్టల్‌లో నమోదు చేయాలి..

అనంతరం విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా పాఠశాలల విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది సమాచారం యూడైస్ ప్లస్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. నమోదు చేసే సమాచారం ప్రాతిపదికనే పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూరుతాయని వివరించారు. పాఠశాలల వసతులకు సంబంధించి పూర్తి సమాచారాన్ని ఈనెల 15లోగా యూడైస్ ప్లస్ పోర్టల్‌లో నమోదు చేయాలనీ సూచించారు. ఈ ప్రజావాణిలో ఆర్డీఓ స్రవంతి, జిల్లా విద్యాధికారి టీ ప్రణిత, జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి రవిందర్ కుమార్, జిల్లా బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు రాజాలింగు, సునీత, రమేష్ రాథోడ్, మున్సిపల్ కమీషనర్ శైలజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులను పంపిణీ చేయాలని నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసుల్లోని కొలం తెగకు చెందిన వారికి రేషన్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో భీంపూర్ మండలం గుంజాల గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లంక రాఘవులు నేతృత్వంలో బాధితులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అదనపు కలెక్టర్ శ్యామల దేవికి వినతిపత్రాన్ని అందించారు. ఇప్పటివరకు తమకు రేషన్ కార్డులు లేవని బయట మార్కెట్‌లో రూ. 25వేల రూపాయలతో డబ్బులు పెట్టి సరుకులు కొంటున్నామన్నారు. ఈ విషయమై అధికారులకు పలుమార్లు విన్నవిస్తున్న ఫలితం లేకుండా పోయిందన్నారు. తమకు రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వం అందించే ఎలాంటి పథకాలు రావడం లేదన్నారు. పేదలకు రేషన్ కార్డు వెంటనే పంపిణీ చేయాలని కోరారు. ఆదివాసుల సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వీరికి న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో వారితో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, మండల నాయకులు రొడ్డ రాజు, నాయకులు మడవి శోభ, టెక్కం సురేఖ, మడవి చందన, మడవి లక్ష్మి, టెకాం అరుణ, ఆత్రం భీంబాయి, గ్రామస్తులు, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి



నవతెలంగాణ-జైనథ్

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ప్రజలు ఆదరించి తనను ఎమ్మెల్యేగా గెలిపించారని, ఇందులో కార్యకర్తల పాత్ర ఎంతో ఉందని, ఇక స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత తొలిసారిగా మండలానికి ఆయన సోమవారం వచ్చారు. ముందుగా లక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిరాల గ్రామంలోని ఓ ఫంక్షన్ హాలులో మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ఈ ఎన్నికలు ఒక యుద్ధంల జరిగాయన్నారు. ధర్మానికి అధర్మానికి మధ్య జరిగిన ఈ యుద్ధంలో ధర్మం గెలిచిందన్నారు. ఈ గెలుపు అందరి సమిష్టి కృషి సాధ్యమైందన్నారు. ఎలాంటి పక్షపాతం లేకుండా ప్రజ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. జనవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయని, వాటి కోసం కార్యకర్తలు సన్నద్ధం కావాలని తెలిపారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై కార్యకర్తలతో చర్చించి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కరుణాకర్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు రాందాస్, జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్ రెడ్డి, స్థానిక సర్పంచ్ బోయర్ విజయ్, మయూర్‌చంద్ర, ఉప సర్పంచ్ రాకేష్ రెడ్డి, నాయకులు రమేష్, పోతరాజు, రమేష్, టి.సాయికిరణ్, చంద్రకాంత్, ప్రవీణ్, వెంకన్న, రాకేష్, రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండవ విడత గొర్లను పంపిణీ చేయాలని..



గొల్ల కురుమలకు రాయితీపై గొర్రెలను పంపిణీలో జిల్లాల వారీగా అర్హులను గుర్తించిన అధికారులు పంపిణీలో నిర్లక్ష్యం చేస్తున్నారని బాదితులు ఆరోపించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్‌కు విడత గొర్రెల కోసం డీడీ చెల్లించిన మావల మండలం బట్టిసవర్గామ గ్రామ గొల్లకుర్మలు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలో దాదాపు 22 మంది డీడీలు చెల్లించి 15 నెలలు గడుస్తుందని, కొత్త ప్రభుత్వమైన గొర్రెలు పంపిణీ చేయాలని కోరారు. లేని పక్షంలో తాము కట్టిన డీడీ తిరిగి చెల్లించాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మర్రి అశోక్, రమేష్, రాజన్న ఉన్నారు.

జీతభత్యాలు చెల్లించాలని వీఆర్‌ఏలు



బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓ ఎంఎస్ 81, 85 ప్రకారం తమకు జూనియర్ అసిస్టెంట్లుగా ఆయా శాఖల్లో పోస్టింగ్‌లు కల్పించిందని, అప్పటి నుండి ఇప్పటివరకు విధులు నిర్వర్తిస్తున్న ఇంతవరకు ఎంప్లాయి ఐడీ, జీతభత్యాలు రావడంలేదని వీఆర్ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తమ గోడును చెప్పుకోవడానికి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి తరలివచ్చారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్‌కు అందజేసి తమ గోసను చెప్పుకున్నారు. చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్నామని, తమ కుటుంబాలను పోషించుకోవడం కష్టసాధ్యంగా మారిందని పేర్కొన్నారు. తమ సమస్యలను కొత్తగా కొలువుదీరిన రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

మెడికల్ పరీక్షలు నిర్వహించి, ట్రైనింగ్‌కు పంపండి సారూ..



మెడికల్ పరీక్షల తరుణంలో నిలిచిపోయిన 2022 తెలంగాణ పోలీస్ నియామక ఉద్యోగ నోటిఫికేషన్‌లో ఎంపికైన అభ్యర్థుల మెడికల్ పరీక్షలు వెంటనే నిర్వహించి ట్రెనింగ్ ప్రారంభించేల తగిన చర్యలు తీసుకోవాలని కానిస్టేబుల్ అభ్యర్థులు కోరారు. సోమవారం ప్రజావాణి విభాగంలో కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కానిస్టేబుల్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించామని, కోర్టులో కేసు కారణంగా ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. నోటిఫికేషన్ వెలువరించిన సమయంలో వేయలేని కేసులు ఫలితాలను ప్రకటించక వేస్తూ నియామక ప్రక్రియను నిలువరిస్తున్న పరిస్థితి ఉందన్నారు. పోలీస్ ఉద్యోగం కోసం కష్టపడ్డామన్నారు. మూడు నెలలు కావస్తున్న ఈ ప్రక్రియ ముందుకి సాగడం లేదన్నారు. కొత్త ప్రభుత్వం ఈ నోటిఫికేషన్ రద్దు చేస్తుందేమోనని ప్రచారం జరుగుతుందన్నారు. వెంటనే తమను శిక్షణకు పంపించేలా చొరవ చూపాలని కోరారు.

శరీరం దృఢంగా ఉంటే మెదడు ప్రశాంతంగా ఉంటుంది

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శరీరం దృఢంగా ఉంటే మెదడు కూడా ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉంటుందని హార్ట్ ఫులెనెస్ మెడిటేషన్ రిజినల్ కోఆర్డినేటర్ షరీఫ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో హార్ట్ ఫులెనెస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ధ్యానం, యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ తరగతులకు ఆయన పాల్గొని యోగా, ధ్యానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పలు ఆసానాలు వేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా మెడిటేషన్ రిజినల్ కోఆర్డినేటర్ షరీఫ్ మాట్లాడుతూ యోగా, ధ్యానం వల్ల మానసిక ప్రశాంత, శారీరంగా దృఢంగా ఉంటుందన్నారు. యువతలో మంచిచెడు రెండు ఉంటాయని, మంచిని స్వీకరిస్తూ చెడుకు దూరంగా ఉండాలన్నారు. మన శరీరం, మెదడును అదుపులోకి తీసుకోవాలంటే యోగా, ధ్యానం ఎంతో దోహదం చేస్తాయన్నారు. నిత్యం యోగ, ద్యానం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అనిత, సత్యనారాయణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరేసుకొని రైతు కూలీ ఆత్మహత్య

నవతెలంగాణ-జైనథ్

మద్యానికి బానిసై రైతు కూలీ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై పుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన గొల్ల రాములు(70) వ్యవసాయ కూలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని పంచనామ చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేనివి : పాయల శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్



స్వచ్ఛ పట్టణంతో పాటు ప్రజా ఆరోగ్య రక్షణలో మున్సిపల్ కార్మికుల సేవలు ఎనేలేనివని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేను యూనియన్ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు దర్శనాల నగేష్, ప్రధాన కార్యదర్శి శంకర్ ఉన్నారు.

వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌ను తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం హెచ్-1 నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖకు అవసరమైన సహాయ సహకారాలు తన వంతు ఎప్పుడు ఉంటాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు బండారి కృష్ణ, ప్రధాన కార్యదర్శి అల్లాడి రఘురాం, మహేందర్, శ్రీకాంత్, రమణాచారి, వెంకటరమణ, సంపత్ కుమారి, లీలా, పద్మ వెంకటమ్మ, రవీందర్ రాథోడ్, ప్రమోద్, నగేష్, నవీన్ ప్రశాంత్ దేశ్పాండే, రజిత, విష్ణు, దయాకర్ ఉన్నారు.

ఈ-కేవైసీ ఇక్కట్లు..!

- వివరాలు సమర్పించాలని ఆయిల్ కంపెనీల ఉత్తర్వులు
- గ్యాస్ ఏజెన్సీల ఎదుట బారులు తీరిన లబ్ధిదారులు
- సౌకర్యాలు కల్పించని నిర్వాహకులు



ఆదిలాబాద్‌లో ఈ-కేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీ ముందు బారులు తీరిన జనం

నవతెలంగాణ -ఆదిలాబాద్ అర్బన్

కేంద్ర ప్రభుత్వం మహిళలకు ఉచితంగా అందజేసిన ఉజ్వల వంటగ్యాస్ కనెక్షన్ మనుగడలో ఉండాలంటే ఈ-కేవైసీ నమోదు తప్పనిసరి చేస్తూ ఆయిల్ కంపెనీలు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 31లోపు ఈ-కేవైసీ వివరాలు నమోదు చేసుకోకుంటే కనెక్షన్ రద్దు అవుతుందనే భయాందోళనల నేపథ్యంలో లబ్ధిదారులు జిల్లాలోని సంబంధిత గ్యాస్ ఏజెన్సీల ఎదుట బారులు తీరుతున్నారు. గంటల తరబడి నిరీక్షిస్తూ వివరాలను సమర్పించడానికి రోజుల తరబడి క్యూ కడుతున్నారు. తమ కనెక్షన్ ఎక్కడ రద్దువుతుందననే ఉద్దేశంతో వివరాలు అందించేందుకు మహిళలు, పురుషులు ఆయా ఏజెన్సీల ఎదుట బారులు తీరుతున్నారు. ప్రతిరోజు వేల సంఖ్యలో లబ్ధిదారులు ఏజెన్సీ ఎదుట ముప్పు తిప్పలు పడుతు వివరాలను నమోదు చేయించుకుంటున్నారు. లబ్ధిదారులు ఉదయం 9 గంటలకే ఆయా ఏజెన్సీలకు చేరుకోగా వేలిముద్రలు, ఫేస్ గుర్తింపు, ఐరిస్ ద్వారా ఏజెన్సీలు లబ్ధిదారుల వివరాలను సాయంత్రం 5 వరకు సేకరిస్తున్నాయి. కొన్ని ఏజెన్సీల దగ్గర టోకెన్ల సిస్టంను అందుబాటులో ఉంచగా టోకెన్ లభించని లబ్ధిదారులు నిరుత్సాహంలో పడిగాపులు కాస్తున్నారు. తమ వంతు రాని లబ్ధిదారులు నిరాశతో ఏజెన్సీల నుండి వెనుదిరుగుతున్నారు. అయితే రోజు ఈ-కేవైసీ కోసం వచ్చిన వినియోగదారులకు కనీస సౌకర్యాలైన టెంట్, తాగు నీరు కూడా కల్పించడం లేదని ఆరోపణలు కూడా వస్తున్నాయి.

వారానికి టోకెన్ వచ్చింది

రుక్సానా, కేఆర్‌కే కాలనీ, ఆదిలాబాద్.



వారం రోజులుగా ఈ-కేవైసీ కోసం ఏజెన్సీ చుట్టు తిరగడంతో టోకెన్ లభించింది. అది కూడా 14వ తేదీన నమోదు ప్రక్రియకు రావాలని సూచించారు. ఎమి చేయలి తెలియక తిరిగి వివరాలను సమర్పించకుండానే వెనుదిరగాల్సి వచ్చింది.

రెండు రోజులుగా తిరుగుతున్నా..

స్వామి, యాపల్‌గూడ, ఆదిలాబాద్ రూరల్ మండలం



గత రెండు రోజులు నుంచి నమోదు ప్రక్రియ కోసం గంటల తరబడి ఏజెన్సీ ముందు నిలుచుంటున్నాను. టోకెన్లు ఇవ్వాలని కోరిన సిబ్బంది స్పందించడం లేదు. నమోదు ప్రక్రియ గూర్చి సరిగ్గా తెలియజేయకపోవడంతో ప్రతిరోజు ఏజెన్సీ వద్దకు వస్తున్న పట్టించుకోవడం లేదు.

రూ.500 సిలిండర్‌కు నమోదు ప్రక్రియకు సంబంధం లేదు

నానందుల జగన్మోహన్, భారత్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్



ఈ-కేవైసీ వివరాల నమోదు ప్రక్రియ మార్చి 31 వరకు గడువు పొడిగించబడింది. ఆయిల్ కంపెనీల ఆదేశాల మేరకు ప్రతి కనెక్షన్ లబ్ధిదారుడు ఈ-కేవైసీ చేయించుకోవాల్సిందే. ప్రతి ఒక్క గ్యాస్ వినియోగదారుడు తమ వివరాలతో మార్చి 31 వరకు వివరాలను సమర్పించుకోవచ్చు. డిసెంబర్ 31 గడువు తేదీ అనుకొని గ్యాస్ వినియోగదారులు ఏజెన్సీ ఎదుట అనవసరంగా ఇబ్బందులు పడుతున్నారు. లబ్ధిదారుల సౌకర్యార్థం రోజుకు 600 టోకెన్ల చొప్పున లబ్ధిదారుల వివరాలను నమోదు చేస్తున్నాం. ప్రభుత్వం రూ. 500కు ఇచ్చే సిలిండర్‌కు నమోదు ప్రక్రియకు ఎటువంటి సంబంధం లేదు. సిలిండర్ ధర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు రూ.500కే లభిస్తుంది.

కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు



నవతెలంగాణ ఆదిలాబాద్ రూరల్

మండలంలోని అంకోలి గ్రామ పంచాయతీలో యాంటీ రేబీస్ టీకాలు కుక్కలకు వేశారు. పశువైద్యాధికారి డా. సురేష్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించి పెంపుడు కుక్కలతో పాటు వీధి కుక్కలకు టీకాలు వేశారు. గ్రామస్థాయిలో కుక్కల పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేశామని, కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్ చేసేల ప్రణాళికలు చేశామని ఈసందర్భంగా వైద్యులు సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూమన్న, రైతులు, గ్రామస్తులు, పంచాయితీ కార్యదర్శి పాల్గొన్నారు.

దళితదెబ్బ జేపీసీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-బోథ్



దళిత దెబ్బ పేరుతో ఏర్పాటు చేసిన జేపీసీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినంతరం మాట్లాడుతూ నార్నూర్ మండలంలో దళిత దెబ్బ పేరుతో జేపీసీ ఏర్పాటు చేసి ఆదివాసి, గిరిజనుల మనోభావాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయకులు పోల్లన్న, కిషన్, విజయ్, జుగాది రావు, పెందూర్ లింగు, సుదర్శన్ పాల్గొన్నారు.